# ఎంత ఘాటు ప్రేమయో!

## టక్ టక్ టక్!

"యస్, యస్, ఎవరూ... మీరు... మీరు..." .. " నేనే మేడమ్, శివాజీని, పక్కరూంలో దిగాం మా బ్రదర్సూ నేనూ, వాళ్లు బయటికెళ్లారు. నేను కాలక్షేపం కోసం వచ్చాను .. మీ.. పేరు .."

" నా పేరా, ఝాన్సీ రాణండీ" ... " లోపలికి రావచ్చా? బిజీగా ఉన్నారనుకుంటాను." " అ.. అ.. అ.. లోపలికొస్తారా... రరర రండి... బిబిబ్బిజీ ఏం లేదనుకోండి సార్, తలుపు తీసే ఉంచండి ప్లీజ్!" ... " ఎందుకులెండి, దగ్గరగా వేసుంచుతాను. బార్ల తీసుంచితే హోటల్ బాయ్స్ కళ్ళల్లో పడతాం... ఇలా ఈ బెడ్ పక్కన కుర్చీలో కూర్చో వచ్చా?"

" హె హె హెబ్బే.... దానికేముంది... కూర్చోండి." ... " మీ సామాను చాలా నీట్ గా సర్దుకున్నారు. అలా సర్దుకున్నవాళ్ళని చూస్తే నా కెంతో ఆనందమండీ! అందరు ఆడపిల్లలూ మీలాగే ఉంటే ఎంత బావుండును!... మరీ మోడర్న్‌గా ఉన్నా నాకు చిరాకేస్మండీ... ఏంటో! మా మామయ్య కూతురూ ఉంది. లక్షతో నాకు గుదిండ అవుతానంటే నేను ఛస్తే ఒప్పుకోటం లేదు... అరె, అలా నిలబడే ఉన్నారేంటి.... మీరు కూడా ఇలా మంచం మీదికొచ్చి కూర్చోండి మేడమ్!.. అన్నట్టు మీరు కూడా ఫామిలీతోనే ఒచ్చినట్టున్నారే!"

" అబ్బే , ఫామిలీ లేదండి. నాకింకా... పెళ్ళి ... కాలేదు... మా ఫాదరూ బ్రదర్సూ సిటీ చూట్టానికెళ్లారు. నేనొక్కత్తేనే రూంలో ఉండిపోయాను. సామాను చూస్తూ ... రోజుల్ని నమ్మలేం గదండీ!"... "ఐసీ... నాకూ కాలేదులెండి పెళ్లి!... అన్నట్టు మాది రామచంద్రపురం. నేను బియ్యే హిస్టరీ సెకండియర్... మీరు..."

" నేనా?... నేను... నేనూ బియ్యే హిస్టరేయేనండి. ఫస్టియర్, మాది రాజమండ్రి"...

" అరె మీకూ నాకూ చాలా దగ్గర దగ్గరగా కలుస్తోందే!.. మా అమ్మగారు నన్ను చిన్నప్పట్నుంచీ -నాన్నగారి లాగా అజగరంలాగా పడుండకు నాన్నా. శత్రువులకీ, పెళ్ళానికీ దడిసేవాడివి అవ్వకు. నీ ప్రేమను ఒకసారి రుచి చూపిన నీ పెళ్లాం నీ చుట్టూనే ఎప్పుడూ తిరుగుతుండేట్టుగా నువ్వు దాన్ని ప్రేమించాలి హాజీ మస్తాన్ శివాజీల్లాగా నీ శత్రువుల్ని చావగొట్టేవాడివి అవ్వాలి నువ్వు!- అంటూ పెంచిందండీ. నాకు పేరు ఆవిడ పెట్టిందే! దాతో నాకే మయిందో తెలుసా?.. ఎన్ సి సి.లో ఓ సర్టిఫికెట్టొచ్చేసింది. అసలిప్పుడు ఇద్దరు రౌడీల్ని నామీదికి రమ్మనమనండి. నీట్‌గా చర్మాలొలిచేసి వాటిన ఆమూలకీ, ఎముకల్ని ఇదుగో ఈ మూలకీ, గుండెకాయల్ని ఈ బకెట్ లోకి విసిరిపారేసి చెయ్యి దులిపేసుకుంటాను, తెల్సా? శత్రువుల విషయంలో నాది తప్పంటారా ఝాన్సీగారు?"

" నోనో నెవ్వర్! మిల్లీగ్రాం కూడా తప్పులేదు. అసలు నా విషయం కూడా అంతేనండీ శివాజీగారూ! మా నాన్నగారు లాండ్ లార్డ్ నా చిన్నతనంలో పొలం నించొస్తూనే ఆయన నన్ను తన పక్కలో కూర్చోబెట్టుకుని ' పిల్లల్ని కనటమే ఆడదాని కర్తవ్యమనుకునేవు. పూలన్ దేవి కున్నంత కసి, ఝాన్సీలక్ష్మి కున్నంత పౌరుషం రావాలమ్మా నీకు. పది కుటుంబాలు నీవల్ల బతగ్గలగాలి తల్లీ' అని చెప్పేవారు. నాకు కరాటే గూడా నేర్పించారండీ బాబూ! హహ్హహ్హాహ్హా! అదేంటి , నా వైపు అట్లా అదోరకంగా చూస్తున్నారు! ... నేనంత అందగత్తెనా శివాజీగారూ!"

" అబ్బ, అంత పచ్చిగా అడిగితే ఎట్లా ఝాన్సీగారూ! మీకున్న కాఫీ గింజలాంటి ఆ బుల్లి నోరు, ములక్కాడలాంటి పొడుగు ముక్కు, ఆసూ కండెల్లా తిరిగే ఆ కళ్లూ, నూనె లేకపోయినా పొడుగ్గా ఉన్న ఆ జడ, నన్నని కంఠం, కంఠంలో అపుట్టుమచ్చ, ఇంకా ఆ కింద .. మెళ్ళో ఆ బంగారం గొలుసూ ..అయిదారు కాసులుందనుకుంటాను... సారీ మేడమ్!.."

" ఊఁ ఆపేశారేం! అబ్బ ఒక్కసారిగా ఆనందం అంచుల్నుంచి ఆగాథం లోతు ల్లోకి తోసేశారు గదండీ నన్ను!.. ఇస్స్ ఏం బాధొచ్చిపడిందమ్మా"

" మరి, మరి ఝాన్సీ రాణీగారూ.." .. "అబ్బా , ఆ గారూ ఏంటండీ బోరు . ముద్దుగా రాణీ అని పిలవక!"

" అహఁ హఁ అబ్బే... పోనీండి .. రాణీ అనే పిలుస్తాను మీ కిష్టమైతే . మీ ఇష్టమే నా ఇష్టం!"

" భలే, ఎంత అందమైన డైలాగన్నారండి! మిలియన్ డాలర్ డైలాగ్ ! అందమైన అబ్బాయిలు అందంగా మాట్లాడుతారు కామోలుస్మీ!... ఆ చాపచుట్ట క్రాపు, ఆ చెంపచుట్టు గడ్డం, సన్నమిరప మీసం, హాండ్‌లూమ్‌ది కాబోలు ఆ టై.... అవునూ, అది గ్వాలియర్ పాంటింగాండీ? చారల్తో ఎంత బాగుందో? మీ వంటి పురుషుడికి తగిన పాంటు!...

" నా పాంటు గురించే చెబుతున్నారు గానీ, మీ చీరెమటుకూ! ... దీనికి తీసికట్టు విమల్ హాట్ ట్రిక్కు! మీ ఒంటి లేగులాబీ లావణ్యానికి దీని రంగు ఖచ్చితంగా మాచ్ అయింది సుమండీ! ఎంత ఫై ఇ ఇఇ ఇ న్ టేస్టో' మీది!.. ఏదీ దీని మృదుత్వం ఓసారి చూడనివ్వండి!"

" అఁ అఁ నా ఒంటిమీద చెయ్యేస్తున్నారా!.. ఏంటండోయ్, సూదంత చనువిస్తే గునపంలాగా మీదకొచ్చేయడమే!.. చీరెనే చూడాలంటే ఇదిగో నా కొంగు- అందిస్తున్నాను, చూసుకోండి."

" సారీ మేడమ్! చీరెకే అందాన్నిస్తున్న మీ శరీర లావణ్యం నిజానికి మీ ప్రియుడికి మాత్రమే అంకితమవ్వాలి.. అన్నట్టు .. అన్నట్టు... మాడమ్... నువ్వింత వరకూ ఎవరికైనా ప్రేమభిక్ష పెట్టావేమో తెలుసుకోవచ్చా?"

" ఏవ్వెవ్...ప్చ్?"

" అదేంటి! ఒక మహా సౌందర్యరాశి యొక్క ప్రేమభిక్షను పొందే మహాద్భాగ్యం ఈ భూమ్మీద ఒక్క నన్నాసికీ లేకపోయిందా?... ఆశ్చర్యంగా ఉందే! నాబోటి ప్రేమికులకా భిక్ష దొరకటంలేదు. మీబోటి ప్రేమికులికా బిచ్చగాడు దొరకటంలేదు, అయ్యో అయ్యో ఎంత దారుణం!"

" నన్ను రెచ్చగొట్టకండి బాబూ, బాధ భరించలేను! మహా సున్నితమైంది నా మనస్సు!"

" ప్రేమ విషయంలో ఇటీజ్ నెవ్వర్ టూలేట్ అన్నాడు వాస్కోడిగామా అనుకుంటాను. మీరు ప్రేమభిక్ష పెట్టటంఇప్పుడు బిగిన్ చేసెయ్యకూడదూ? అందుబాటులో తీరు బాటుగా ఎదురుకుండా నేను ... ఉన్నాను గదా! .. మీకు అర్ధమయ్యేట్టు చెప్పగలిగానా మాడమ్?"

" అయ్యయ్యో మనిద్దరం ప్రేమించుకోటమే!"

" ఏం, ఏమంటీ? ... మానాన్నకి నేనొక్కణ్ణే. కట్నం అడగడు. మీరు నాకు నచ్చారు. నేను మీకు నచ్చాను. ఇంక అడ్డమేమిటి చెప్పండి, పెళ్ళిలో తెరసెల్లా తప్పు! ... రతీ మన్మథుల్లాగా ,మేనకా విశ్వామిత్రుల్లాగా, వరూధినీ ప్రవరాఖ్యుల్లాగా ఫస్టుగా, జాలీగా, సిల్లీగా మనం ఒకళ్ళ నొకళ్లం ఘాటుగా ప్రేమించుకుంటూ వుంటేచాలు... ఇప్పుడే మొదలుపెడదాం ఇలాంటి ఏకాంతం మళ్లీ మనకు దొరక్కపోవచ్చు... కాదనకు ఝాన్సీ, ప్లీజ్... నన్ను నమ్మవా?"

" ఆగండాగండి, మీదకి రాకండి . నమ్మకపోవటం కాదు కానీ .. మరి మన్మథుడు మాడిపోయాడు విశ్వామిత్రుడు వొదిలి పోయాడు, ప్రవరాఖ్యుడు పారిపోయాడు. మీరు అట్లాగే చేస్తారా? తీరు బడిగా నా రూమ్‌లోకొచ్చి కూర్చొని నన్ను పాడు చెయ్యాలని ప్లానా, ఎంత సాహసం! ఇందాకట్నుంచీ చూస్తున్నాను, అసలు మీకు మంచీ మర్యాదా లేవేంటండీ?"

" తొందరపడకు ఝాన్సీ మరి!... అసలు విషయమేంటంటే, రతీమన్మథులు హిమాలయాల్లో హైరాన పడ్డారు, మేనక విశ్వామిత్రులు ఆశ్రమంలో అరుగులమీద ఆయాసపడ్డారు. వరూధినీ ప్రవరాఖ్యులు ఉద్యానవనాల్లో ఊరించుకున్నారు అయితే ఆన్‌ఫార్చునేట్లీ ఇవన్నీ పాత పద్ధతులు. లేటెస్ట్‌గా జరుగుతున్నదేంటంటే విమానం లోనూ, నూనె బావులమీదా, బొగ్గుగనుల్లోనూ, గబ్బిలాల గుహల్లోపలా, తిమింగిలాల మధ్య ప్రేమికులు ప్రేమించుకుంటున్నారు. మనం ప్రేమించుకోవటం మొదలు పెడితే మాత్రం అది కొత్త తరహా పద్ధతి అయితీరుతుంది

" ఏంటోనండి, మీ మాటలు వింటూంటే మనం ప్రేమించుకోక తప్పదనిపిస్తోంది... ఊఁ((! తప్పేట్టులేదు . అయితే మనదెక్కడంటారు!"

" " కనుక్కోండి చూద్దాం!". " ఉహూఁ, తెలీటంలా!"

" చెప్పనా, చెప్పనా . అగ్ని పర్వతం మీద! ఇటలీలో విసూవియస్ అనే అగ్ని పర్వతం ఉంది. దానిమీద!"

" అమ్మబాబోయ్, భయమేస్తోందండీ! అది పేలిపోతే! ఎలా? నేనూ మా నాన్నకు ఒక్కతి నేనండి!"..."హహ్హహ్హహ్హా! చూశారా, ఆడవాళ్ళు అమోఘమైన అబలలనిపించారు మీరు! ఆ అగ్ని పర్వతం పేలదోయ్ సిల్లీ, చల్లారిపోయింది, రెండువేల ఏళ్ళకిందట!"

" నిజంగా! . వీరు ఎంత గొప్పహీరో అండి! ఇట్టే గట్టెక్కించారు కష్టాన్నించినన్ను! అందుకే మీరంటే నాకు . నాకు. అదోరకమైన ఇది . కలుగుతూ ఉందండి!"

" ఆహాఁ! ఓహ్ఁ! ఇహిహిఁ నేను, మహాదృష్టవంతుణ్ణి ఝాన్సీ!.... ఏవయితేనేం ప్రేమించుకోటంలో మనం ఇప్పుడు స్టేజి వన్ దాటేసాం. ఇహ ఆ ప్రేమని ప్రస్తుతానికి కొంచేం బయటపెట్టుకుని మిగిలిందాన్ని విసూవియస్ మీద కానిచ్చేసుకుందాం.. ఈ బయట పెట్టుకోవటం ఎట్లా? . నీ కేమయినా తోస్తోందా?"

" ఆహాఁ.. నాకూ ఏమి తోచట్లేదండి!" . " ఎట్లాగబ్బా! .. పోనీ ఓపని చేస్తే... నేను నీమెడమీద ఒక చిన్న... స్మాల్ ... సింపుల్.. లైట్.. ముద్దుపెట్టుకుంటే?". "ముద్దా . ముద్దా .... బ్యూటిఫుల్!... ఐడియా బాగుందండీ! మెడమీదేం ఖర్మండీ మొహం మీద పెడితే మాత్రం కాదంటానా!" ... " మొహం మీదొద్దులే, కంఠం బాగుంది అక్కడ పెడతాను "

" అదేంటండీ, ఇందాకట్నుంచీ నన్ను స్టేజివన్‌లో తెగ ప్రేమించేసుకున్నారు. ఇప్పుడు మొహం ముద్దొద్దంటే పెరీల్‌మని కళ్ళు పేలిపోవా?. రండి, ముందుకు జరగండి!"

" ఆహాఁహాఁ వద్దులే!. ఆఁ ఆడపిల్ల ఇట్లా మీదికొచ్చేయటమే! నన్ను.. నన్ను. ..."

" ఎహె, కదలకయ్యా!. గట్టిగా హత్తుకోనీ!". " ఏయ్, నా బాక్ పాకెట్‌లోంచి పర్సు తీస్తున్నావా! రాస్కెల్!" " యూ ఫూల్, ముద్దుపేరుతో నా గొలుసు ఊడదీశావా! పళ్ళురాలగొడతాను!"

" నా డబ్బిస్తావా, ఇవ్వవా! చూస్కో, నీ జుట్టుపట్టుకొని . ఆఁ! ఇది విగ్గా!. నువ్వు మగాడివా?"

" నాగొలుసెత్తుకుపోవటానికేశావంత్రా ప్లాను! నిన్ను మక్కెలిరగదన్నక . ఓర్నీ నీదీ విగ్గే?

అసలు నువ్వు అడదానివా!... ఒసేయ్ నాంచారీ, నువ్వు నెల్లూరెంకన్న మురానుంచి పారిపోయొచ్చిందానివి కాదంటే?''

'' అఁ... సర్లే దానికేంట్లేరా ఎదవా. కర్నూలు దోపిడీ సొమ్ముతో పారిపోయొచ్చిన తిరపతివి కావంట్రా నువ్వు!... నీకోసం ఈ ఊళ్ళోనే ఎతుకుతున్నాళ్ళే నీ యముడు బంగారయ్య!''

'' అఁ!''

(ఈవారం 9-2-84)

* * *    * * *    * * *

# గొలుసు ఖరీదెంత ?

''శ్రీకంఠం అన్నయ్యా, వదినా వచ్చారోయ్, తొందరగా కాళ్ళకు నీళ్ళు పట్రా!'' అన్న తన భర్త ఉపేంద్రం కేక విని ఇంట్లోంచి హడావుడిగా నీళ్ళు తెచ్చింది స్వాహ.

కాళ్ళు కడగడాలూ; కుశల ప్రశ్నలూ వగైరాలయ్యాక అన్నదమ్ములిద్దరూ వసారాలో దిగబడి పోగా స్వాహ, తన తోటికోడలు ఇంద్రాణిని వంటింట్లోకి తీసుకొని వచ్చి కూర్చోబెట్టి, కుంపట్లో కాఫీకి నీళ్ళు పెట్టింది.

ఇంద్రాణి మొహాన చిరునవ్వు మెరుస్తోంది. స్వాహ మొహంలో అసహనం తొంగి చూసింది. '' మీరు యూనియన్ కార్బైడ్ మనుషులు కనుక, జీతం నాలుగంకెల్లో వుంటుంది. కలకత్తా కనక, కారు కూడా వచ్చిందనుకుంటాను. ఇల్లు కట్టుకున్నారా?''

ఇంద్రాణి పెద్దగా నవ్వింది. ''మమ్మల్ని మా జీతం రాళ్ళతోనే కొలుస్తున్నావన్న మాట! చెట్టుకు తగిన గాలి ఉన్నట్టు, మాకు తగిన సమస్యలు మాకుంటాయని ఊహించ లేవుటమ్మా! రోజులు మారుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నాయి. మీరు కూడా మాతో సమానంగా జీతాలు పుచ్చుకొనే రోజులు రావని నమ్మకమేమిటి? ఇంతా జేసి అన్నాదమ్ములిద్దరిదీ ఒకటే చదువుకదా!- సర్లేవమ్మా చెల్లెలా! నీతో ఇది ఎప్పుడూ ఉన్నదే గాని, ఏదీ, లేక లేక పుట్టిన మీ వంశోద్ధారకుడు?''

స్వాహ మొహంలో హఠాత్తుగా తొంగి చూసిన అసంతృప్తి ఆమె చేత నిట్టూర్పించి, ''ఏమిటో అక్కయ్యా! ప్రేమ కొద్దీ అట్లా అంటారు కానీ, మా జీతాలు పెరగటమూసరే, మేము ఎదగటమూ సరే, అనిపిస్తుంది.''

ఆమె లేచి పక్కవాటాలోకి వెళ్ళి అక్కడ ఆడుకుంటున్న తన రెండేళ్ళ పసివాణ్ణి ఎత్తుకొని వచ్చి ఇంద్రాణికి అందించింది. వెంటనే వాకిట్లోకి వెళ్ళి గదిలోకి సైగచేస్తూ భర్తను బయటకు పిలిచింది. ''ఏమిటి?'' అంటూ అతను బయటకు వచ్చాడు

''ఏమిటేమిటి? అక్కయ్యకు చీరె, జాకెట్టు పెట్టొద్దూ! రెండు రోజుల కన్నా ఎక్కువ ఉండరేమో, ఇవాళే తెచ్చి ఇంట్లో ఉంచుకోవటం మంచిది'' ..''పెట్లో ఏదో చీరె ఉన్నట్టుంది కదా! ఇప్పుడు మళ్ళీ కొనటం దేనికి? లేని పోని భేషజాలకు పోవటం మంచిది కాదు.''